
సాక్షి ఒడిశా

ఆదివారం । 3 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 2,17,372
బంగారం 2 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
వెండి 34 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ముగిసిన రాష్ట్రపతి పర్యటన

రాష్ట్రంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన శనివారంతో ముగిసింది.

-IIలో▸



ముగిసిన మహా నగర్ ఉత్సవాలు

బరంపురం కల్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న మహనగర్ ఉత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి.

-IIలో▸

బీజేడీకి మరో ఎదురుదెబ్బ..!

- ఎమ్మెల్యే అరబింద డాలి గుడ్ బై
- నేడు బీజేపీలో చేరిక



అరబింద డాలి



భువనేశ్వర్: బిజూ జనతా దళ్‌కు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్, సిట్టింగ్ ఎమ్మెల్యే అరబింద డాలి పార్టీకి రాజీనామా చేసినట్లు శనివారం ప్రకటించారు. ఎన్నికలకు ముందు అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ)కి ఇది పెద్ద షాక్. ఖుర్దా జిల్లా జయదేవ్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న అరబింద డాలి బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అతను శుక్రవారం రాత్రి తన రాజీనామా లేఖను బిజూ జనతా దళ్ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ఈమెయిల్ ద్వారా సమర్పించారు. అధికార పార్టీ నుంచి వైదొలగడానికి ఎటువంటి కారణం చెప్పనప్పటికీ, ఆదివారం భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. ఇతర అగ్రనేతలు గంజాం జిల్లా గోపాల్‌పూర్ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, రాష్ట్ర మాజీ మంత్రి దేబాశిష్ నాయక్, ఖుర్దా జిల్లా చిలికా నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్‌లు ఇటీవల అధికార పక్షం బిజూ జనతా దళ్ నుంచి వైదొలిగారు. వీరి అడుగుజాడల్లో అరబింద డాలి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.

సొంత పార్టీలోకి వెళ్తున్నా

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని సుమారు 1,000 మంది అనుచరులు, కార్యకర్తలు భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. నేను నా మనస్సాక్షికి అనుగుణంగా ప్రవర్తించానన్నారు. తాను సొంత పార్టీలోకి తిరిగి వస్తున్నానని వివరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే దానిపై వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు. అరబింద డాలీ రాష్ట్ర శాసనసభకు 6 సార్లు ఎన్నికయ్యారు. 1992 నుంచి 2000 సంవత్సరం వరకు మల్కాన్‌గిరి నుంచి, 2009 నుంచి 2019 (2014 సార్వత్రిక ఎన్నికలు మినహా) వరకు ఖుర్దా జిల్లా భువనేశ్వర్ – జయదేవ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. నవీన్ పట్నాయక్ కొలువులో రవాణా, వాణిజ్య మంత్రిగా బీజేపీ, బీజేడీ కూటమి ప్రభుత్వంలో బాధ్యతలు వహించారు.

పార్టీ ఫిరాయింపు కొత్తేమీ కాదు

పార్టీ ఫిరాయింపు అరబింద డాలీకి కొత్తేమీ కాదు. లోగడ ఆయన భారతీయ జనతా పార్టీని విడిచిపెట్టి రాష్ట్ర శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర పండాతో కలిసి 2006 సంవత్సరం ఏప్రిల్ 30న భారతీయ జనశక్తి పార్టీలో చేరారు. తదుపరి 2008 మార్చి 24న సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. కొద్ది కాలానికే ప్రాంతీయ పార్టీ బిజూ జనతా దళ్‌లో చేరారు. 2009లో జరిగిన ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీ బీజేడీ అభ్యర్థిగా జయదేవ్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో ఈ స్థానం నుంచి శశి భూషణ్ బెహరాని బీజేడీ బరిలోకి దింపింది. తిరిగి 2019 సార్వత్రిక ఎన్నికల్లో అరబింద డాలి జయదేవ్ స్థానం నుంచి బిజూ జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికలో తన సమీప ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థి నొబొ కిషోర్ మల్లిక్‌పై 18,700 ఓట్ల ఆధిక్యతతో గెలిపొందారు.

జయపురం టిక్కెట్టు ఎవరికో..?

- బీజేపీ టిక్కెట్టుకు ఆశావాహుల ప్రయత్నాలు



ప్రచారం నిర్వహిస్తున్న గౌతమ్ సామంతరాయ్



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న సుదాంసు శేఖర జెన



ప్రచారంలో దూసుకెళ్తున్న హిమాంశు మహాపాత్రో

జయపురం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై కసరత్తులు జరుపుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ టిక్కెట్టు సిట్టింగ్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతికి, బీజేడీ టిక్కెట్టు మాజీమంత్రి సతీమణి డాక్టర్ ఇందిరా నందోకు దాదాపు ఖాయమైనట్లు రాజకీయ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. అయితే ఈసారి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కలలుగంటున్న బీజేపీ మాత్రం జయపురం అభ్యర్థి విషయంలో ఎటువంటి నిర్ణయం వెల్లడించకపోవడంతో ఆశావాహులు విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రజల్లోకి వెళ్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ టిక్కెట్టు కోసం నలుగురు నేతలు పైరవీలు జరుపుతున్నారు. వారిలో ముగ్గురు నేతలు తప్పకుండా టిక్కెట్టు తమదేనని ఆశతో ఉన్నారు. వారు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం ప్రారంభించారు. గత ఎన్నికల్లో జయపురం నియోజకవర్గం నుంచి పోటీచేసిన గౌతమ్ సామంతరాయ్ జయపురం బొరిగుమ్మ సమితిలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఆ ఎన్నికల్లో ఆయన 33,805 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. 2024 ఎన్నికల్లో విజయం సాధిస్తాననే నమ్మకంతో కొద్ది నెలలుగా ప్రచారంలో మునిగి ఉన్నారు. అదేవిధంగా సీనియర్ నేత సుదాంసు శేఖర జెన ప్రతీ గ్రామంలో తిరుగుతూ తన పాత మిత్రులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. అలాగే ప్రముఖ వ్యాపారి హిమాంశు మహాపాత్రో కూడా ఎవరికీ తీసి పోకుండా యువతతో మమేకమవుతూ తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. బీజేపీ టిక్కెట్టు కోసం ఎంతో ఆశతో ఉన్న మరో యువనేత రవీంద్ర మహంతి ఇంత వరకు ప్రచారం ప్రారంభించకపోయినా టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ ఎవరికి టిక్కెట్టు ఇస్తోందో తెలియాల్సి ఉంది.

శివరాత్రి వేడుకలపై సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: దక్షిణ ఒడిశాలోని ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌లో జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు చేపట్టనున్న కార్యక్రమాల సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. జయపురం దేవదాయ ధర్మాదాయ విభాగ అధికారి, జయపురం తహసీల్దార్ మనోలిష ఆచారి అధ్యక్షతన గుప్తేశ్వర్‌లో జరిగిన సమావేశంలో బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధ రాణి చౌదరి, దేవదాయ ధర్మాదాయ పరిచాలన కమిటీ అధ్యక్షుడు లలూ మిత్ర, బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్, కమిటీ సభ్యుడు నరేంవద్ర కందాలియ, కృష్ణదాస్, సూపర్‌వైజర్ హరిహర శతపతి, గురు దురువ, మున్నా దాస్, శుభం త్రిపాఠీ, నవకృష్ణ రథ్, రమేష్ త్రిపాఠీ, సొన చౌదరి, లలూ శర్మ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో బొయిపరిగుడ నుంచి గుప్తేశ్వర్ మార్గంలో రోడ్ల పరిస్థితిపై చర్చించారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగే బుడ, బెడ ఘాట్‌ల ప్రాంతంలో చేపడుతున్న జాగ్రత్తపై సమావేశంలో మాట్లాడారు. ప్రసిద్ధ స్నాన ఘట్టమైన శబరి నదిలో స్నానాలు చేసే భక్తులకు రక్షణ కల్పించేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు.

న్యూస్‌రీల్

చురుకుగా ఎన్నికల సన్నాహాలు



కళాశాలను పరిశీలిస్తున్న అధికారులు

భువనేశ్వర్: ఖుర్దా జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నాహాలు చురుకుగా కొనసాగుతున్నాయి. ప్రధానంగా అధికారిక వర్గాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతోంది. సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) భద్రపరిచేందుకు స్థానిక బీజేబీ అటానమస్ కళాశాలని గోదాంగా ఎంపిక చేశారు. ఈ ప్రాంగణంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) భద్రత వ్యవస్థని ఖుర్దా జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ కళాశాల ప్రాంగణంలో ఓట్లు లెక్కింపు కేంద్రాల సన్నద్ధతను ఆయన పరిశీలించారు. ఈ నేపథ్యంలో సీనియర్ అధికారులతో కలిసి సార్వత్రిక ఎన్నికల కోసం కార్యాచరణ ప్రణాళికను కూడా ఆయన సమీక్షించారు.

రూ.61 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మహాజన్, ద్వివేది తదితరులు

రాయగడ: సదరు సమితికి సుమారు పది కిలో మీటర్ల దూరంలో ఉన్నటువంటి పారిశ్రామిక ప్రాంతమైన జేకే పేపర్ మిల్ ప్రాంగణంలో సుమారు రూ.61 కోట్ల వ్యయంతో మొక్కజొన్నతో తయారయ్యే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు సీఎం నవీన్ పట్నాయక్ శుక్రవారం సాయంత్రం వర్చువల్ మాధ్యమంలో యూనిట్ ఏర్పాటుకు సంబంధించి భూమి పూజకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జేకే పేపర్ మిల్ వర్కింగ్ ఉపాధ్యక్షుడు వినయ్ ద్వివేది, కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, జిల్లా పారిశ్రామిక కేంద్రం ఐపీవో సవ్యసాచి సాహు, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా ఎంతోమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో పాటు మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఇంకా పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి నవీన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

5న బీజేడీ కార్యాలయం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమవుతున్న కార్యాలయం

రాయగడ: స్థానిక తేజస్విని హోటల్ సమీపంలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీజేడీ కార్యాలయం ఈనెల 5వ తేదీన ప్రారంభానికి సిద్ధమవుతోంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ జయంతి పురస్కరించుకొని కార్యాలయాన్ని ప్రారంభించేందుకు పనులు జరుగుతున్నాయి. బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు నిర్మాణ పనులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. సుమారు 700 మంది కూర్చునేవిధంగా సమావేశ మందిరాన్ని అత్యాధునికంగా నిర్మిస్తున్నారు. పార్టీ కార్యాలయం ఎట్టకేలకు ఏర్పాటు కావడంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రౌన్ షుగర్‌తో మైనర్ బాలుడు అరెస్టు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయంలో శనివారం ఒక బాలుడు బ్రౌన్ షుగర్‌తో పట్టుబడ్డాడు. మందిరంలో అమ్మకానికి ఎవరో అతనికి బ్రౌన్ షుగర్ ఇచ్చారని తెలిపాడు. పోలీసులు బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకుని నిందిత మైనర్ బాలుడిని విచారణ కోసం సింహద్వారం ఠాణాకు తరలించారు. శ్రీజగన్నాథ ఆలయ సముదాయం విమల ఆలయం సమీపంలో మైనర్ బాలుడు ఒక పాత్రని సందిగ్ధంగా తెరుస్తున్నట్లు విధి నిర్వహణలో ఉన్న రక్షక జవాను దృష్టిలో పడింది. అందులో నిషేధిత వస్తువులు ఉన్నాయని అనుమానించి ఇతరులను అప్రమత్తం చేశాడు. భద్రతా సిబ్బంది పరిశీలించగా అందులో బ్రౌన్ షుగర్ ఉన్నట్లు స్పష్టమైంది. మైనర్ బాలుడిని విచారించగా శ్రీమందిర్‌లో విక్రయించేందుకు ఎవరో తనకు దీనిని ఇచ్చారని వెల్లడించాడు. విచారణ కొనసాగుతుంది.

కొఠియాలో ఆంధ్ర ఎస్పీ పర్యటన



నేరడివలసలో పర్యటిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో నెలకొంటున్న సమస్యలపై ఆరా తీశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎప్పుడూ సమస్యలు రాలేదన్నారు. కానీ 2019 తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సమయంలో ఒడిశా ప్రజాప్రతినిధులు ఆందోళన చేపట్టిన విషయం గుర్తు చేశారు. ఎగువ శంబి, దిగువ శంబి, కొఠియా, డోలిఅంబ, పట్టు చెన్నూరు, పగులు చెన్నూరు, మడకారు తదితర గ్రామాల్లో ఎస్పీ పర్యటన జరిగింది. కొఠియాలో 21 గ్రామాలపై హక్కుకోసం ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలు దశాబ్దాల నుంచి సుప్రీంకోర్టులో పోరాటం చేస్తున్నాయి. రెండు రాష్ట్రాలకు ఒకేసారి సార్వత్రిక ఎన్నికలు వస్తున్నప్పటికీ పోలింగ్ వేర్వేరు తేదీల్లో ఉండేటట్లు అధికారులు చూసుకుంటున్నారు. ఇక్కడ ప్రజలు రెండు రాష్ట్రాలకూ ఓటు వేస్తారు. ఇబ్బందులు రాకుండా ఉండడానికి పోలీంగ్ అధికారులు ఒక రాష్ట్రానికి సంబంధించి ఒకవేలికి, మరో రాష్ట్రానికి సంబంధించి మరో వేలికి సిరా చుక్కను పెడతారు. దీంతో ఇంతవరకు సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మరో విచిత్రం ఏమిటంటే ఈ గ్రామాలకు ఇరురాష్ట్రాల రేషన్ కార్డులు, పింఛన్లు, అంగన్‌వాడీ, అంగన్‌వాడీ కార్డులు ఉన్నాయి.

నలుగురు ఐపీఎస్‌లు బదిలీ

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ అధికారుల్లో స్వల్ప మార్పులు చేసి నలుగురిని కొత్త పోస్టుల్లోకి మార్చింది. హోం శాఖ అధికారిక ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుత తాల్చేరు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఉత్తర–మధ్య పరిధి), అంగుల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ దీపక్ కుమార్‌ని బదిలీ చేసి బాలాసోర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (తూర్పు రేంజ్)గా నియమించారు. దీపక్ కుమార్ స్థానంలో ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్ జనరల్ (తూర్పు శ్రేణి)గా పనిచేస్తున్న సత్యబ్రత భోయ్‌ని నియమించారు. ఆయన అంగుల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. కేంద్రాపడా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) బి.జుగల్ కిషోర్‌ని బదిలీ చేసి ఖుర్దా జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా నియమించారు. ప్రస్తుత ఖుర్దా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సిద్ధార్థ్ కటారియాను బదిలీ చేసి కేంద్రాపడా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా నియమించారు.


ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

జయపురం: సదర్ పోలీసుస్టేషన్ పరిధి పంపుణీ గ్రామంలో జరుగుతున్న పేకాట శిబిరంపై జయపురం సదర్ పోలీసులు దాడి జరిపినట్లు శనివారం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు. దాడిలో ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, 104 పేకముక్కల కట్టలు, రూ.36,000లు సీజ్ చేసినట్లు తెలియజేశారు. అరెస్టైనవారిలో బిసాయిపుట్ గ్రామానికి చెందిన ధన్‌సారి హరిజన్(52), సొల్బ గ్రామానికి చెందిన గోకుల బెహర(42), పంపుణీ గ్రామానికి చెందిన గోపీనాథ్ నాయిక్, బిసాయిపుట్ గ్రామానికి మంగళ హరిజన్(38), పంపుణీ గ్రామానికి చెందిన శిశిర రౌథ్ (32)లు ఉన్నట్లు వెల్లడించారు.

విజిలెన్స్ వలలో అధికారులు



ఏఎస్ఐ మహారణ

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా దాబుగాం పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న సిమ్మాంచల్ మహారణ ఒక కేసు విషయంలో లంచం తీసుకుంటుండగా విజిలెన్స్ అధికారులకు చిక్కారు. సాక్ష్యాలు తారుమారు చేసేందుకు కక్షిదారుడికి రూ.5000 లంచం డిమాండ్ చేశారు. దీంతో కక్షిదారుడు విజిలెన్స్ అధికారులను సంప్రదించాడు. విజిలెన్స్ అధికారుల సూచనతో పోలీసుస్టేషన్‌లో లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. దీంతో ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

బరంపురం: గంజాం జిల్లాలోని అస్కా నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణుధర్ దొళాయి, అక్కడ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న కులాష్ చరణ్ దాస్‌లు విజిలెన్స్ వలకు చిక్కారు. బరంపురం విజిలెన్స్ ఎస్పీ మాయాధర్ స్వాయి తెలిపిన వివరాల మేరకు.. వేణుధర్ దొళాయి, కులాష్ చరణ్ దాస్‌లు ఒక కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేసేందుకు ఇరువురూ రూ.20 వేలు చొప్పున లంచం ఇవ్వాలని డిమండ్ చేశారు. దీంతో బాధితుడు పి.రాజ సేనాపతి బరంపురం విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. విజిలెన్స్ ఎస్పీ సూచనలు మేరకు డీఎస్పీ సంతును కుమార్ మహాపాత్రో ఆధ్వర్యంలో విజిలన్స్ బృందం ప్లాన్ ప్రకారం వారిని లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అనంతరం అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించారు.



ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుధర్ దొళాయి



క్లర్క్ కులాష్ చరణ్ దాస్

కటక్ సిల్వర్ ఫిలిగ్రీకి జీఐ గుర్తింపు



వెండి తీగల అల్లికలతో రూపుదిద్దుకున్న నావికా వ్యాపార ప్రతీక

భువనేశ్వర్: సున్నితమైన తళతళలాడే వెండి తీగల అల్లికల కళాఖండాలకు రాష్ట్రంలో కటక్ నగరం ప్రసిద్ధి. సిల్వర్ ఫిలిగ్రీగా ఈ కళ పేరొందింది. దీని ప్రాచుర్యంతో కటక్ నగరం రజత నగరం (సిల్వర్ సిటీ)గా వాసికెక్కింది. కటక్ వెండి తీగల అల్లిక పరంపరకు భౌగోళిక సూచిక (జీఐ) గుర్తింపు లభించింది. చెన్నై కేంద్రంగా పని చేస్తున్న జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ శనివారం ఈ గుర్తింపు లభించినట్లు ప్రకటించింది. దీంతో రాష్ట్రం నుంచి 26 రకాల సామగ్రికి జీఐ జాబితాలో స్థానం లభించినట్లు అయ్యింది.

2021లో దరఖాస్తు

ఒడిశా రాష్ట్ర సహకార హస్తకళల కార్పొరేషన్ లిమిటెడ్ (ఉత్కళిక) 2021 సంవత్సరం జూలై 1న కటక్‌లోని ప్రఖ్యాత సిల్వర్ ఫిలిగ్రీకి జీఐ గుర్తింపును కోరుతూ దరఖాస్తు దాఖలు చేసింది. 13వ శతాబ్దానికి చెందిన వెండి తీగల అల్లిక కళకు చారిత్రక ప్రాధాన్యత, పరంపర ఇతరేతర అనుబంధ వివరాలను జీఐ రిజిస్ట్రీకి తెలియజేశారు. వెండి తీగల అల్లిక లేదా 'సిల్వర్ ఫిలిగ్రీ' అత్యంత సున్నితమైన వెండి హస్తకళల్లో ఒకటి. వెండి తీగల అల్లికతో రాష్ట్ర ప్రఖ్యాత సంప్రదాయాలు, ఆభరణాలు, గృహాలంకరణ సామగ్రి, బహుమానాలు, దేవతా మూర్తులు వగైరా కళాఖండాలు ఆవిష్కరించడంతో నలువైపుల విభిన్నత చాటుకుంది. ప్రధానంగా రాష్ట్ర శాస్త్రీయ ఒడిస్సీ నృత్యకారులు ధరించే ఆభరణాలు, ఉపకరణాలు సాంస్కృతిక ప్రతీకగా దేశ విదేశాల్లో ఆకట్టుకోవడం విశేషం. కోణార్క్ చక్రం, నావికా వ్యాపార ప్రతీక హంస నావ, శ్రీజగన్నాథుని ప్రతిమల రూపకల్పన కటక్ వెండి తీగల అల్లిక హస్త కళకు అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాయి. రాష్ట్రంలో పేరొందిన దేవాలయాలు, చారిత్రాత్మక, వారసత్వ కట్టడాల నమూనాలు ఈ కళలో సూక్ష్మ నైపుణ్యతకు అద్దం పడతాయి. పలు రంగాల్లో విశేష గుర్తింపు పురస్కరించుకుని వెండి తీగల అల్లిక కళాఖండాలను గౌరవప్రదంగా బహూకరించడం ఆనవాయితీగా మారింది.

వెండి ప్రభల వెలుగులు

కటక్ మహా నగరంలో దసరా నవరాత్రులు పురస్కరించుకుని ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే దుర్గా పూజల్లో సువిశాల వెండి తీగల అల్లిక ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా సందర్శకులను ఆకట్టుకుంటాయి. పోటాపోటీగా ఏటా రూపుదిద్దుకునే పూజా మండపం ప్రభలు మిరుమిట్లు గొలిపిస్తాయి.

జీఐ జాబితాలో రాష్ట్రం

రాష్ట్రానికి చెందిన పలు ప్రత్యేక పదార్థాలు, వంటకాలు, కళాఖండాలు ఇతరేతర ఉత్పత్తులు, సామగ్రి భౌగోళిక సూచిక జాబితాలో చోటు చేసుకుంటున్నాయి. క్రమంగా ఈ జాబితా విస్తరిస్తోంది. ప్రస్తుతానికి ఇటువంటి 26 రకాల సామగ్రి ఈ జాబితాలో చోటు చేసుకున్నాయి. ఇటీవల ఈ ఏడాది జనవరిలో 7 ఉత్పత్తులు జీఐ గుర్తింపు సాధించాయి. వీటిలో ఒడిశా ఖజూరి గుడొ (ఖర్జూర బెల్లం), ఢెంకనాల్ మాగ్జి, సిమిలిపాల్ పేలాల చట్నీ, నయాగడ్ ముళ్ల వంకాయ, డొంగురియా కోండ్ ఎంబ్రాయిడరీ శాలువా కొపాడాగొండొ, కొరాపుట్ నల్ల జీలకర్ర బియ్యం, లంజియా సవర చిత్రకళ ఇడిటల్ చోటు చేసుకున్నాయి.

క్లుప్తంగా

కిడ్నీ వ్యాధిపై అప్రమత్తం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: కిడ్నీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం కోర్టులోని న్యాయసదన్‌లో ప్రాథమిక దశలోనే కిడ్నీ వ్యాధిని గుర్తించడం ఎలా అనే అంశంపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, ఆర్టీసీ పీఆర్‌ఓ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలను చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద కేటాయించిన లక్ష్యాలను బ్యాంకర్లు కచ్చితంగా చేరుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) సమావేశంలో బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ సంబంధిత, ప్రాధాన్యత, అప్రాధాన్యత రంగాలు, ఎంసీఎంఈ కలుపుకుని 5,20773 మందికి రూ.10577 కోట్లు రుణాలు అందజేశామని, 102 శాతం ప్రగతి సాధించామని వివరించారు. 749 మంది స్వయం ఉపాధి శిక్షణలు తీసుకున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద జిల్లాకు 771 యూనిట్లు మంజూరు చేయాలని లక్ష్యం కేటాయించగా 273 యూనిట్లు మంజూరు చేశామన్నారు. ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద 951 దరకాస్తులు రాగా అర్హత లేని 289 తిరస్కరించి మిగిలిన 63 శాతం లక్ష్యాలను సాధించగలిగామన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.వి.తిలక్, నాబార్డు ఏజీఎం వరప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ విద్యా సాగర్, జిల్లా వ్యవసాయాధికారి కే.శ్రీధర్, పశు పశు సంవర్థక శాఖ జేడీ కిషోర్, ఫిషరీస్, ఇండస్ట్రీస్ డీడీలు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, డ్వామా పీడీ చిట్టి రాజు, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, ఏపీజీవీబీ ఆర్ఎం రాఘవేంద్ర, జిల్లాలో 26 బ్యాంకులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తనివ్వకండి

శ్రీకాకుళం అర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తనివ్వకుండా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులు ఆదరా బాదరాగా పరీక్ష కేంద్రాలకు చేరుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో ఏపీ టెట్ – 2024 పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 140 మందికి 124 మంది, రెండు షిఫ్టులో 140 మందికి 134 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 132 మందికి 120 మంది, రెండో షిఫ్టులో 117 మందికి 95 మంది హాజరయ్యారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య

శ్రీకాకుళం న్యూకాలనీ: విలువలతో కూడిన విద్యను అందించడంలో న్యూ సెంట్రల్ స్కూల్ ముందు వరుసలో ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని పీఎన్‌కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ 30వ వార్షికోత్సవం శనివారం పాఠశాల క్రీడామైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలకు ఎన్‌సీఎస్ స్కూల్ వేదికగా నిలుస్తోందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్ విద్యార్థుల ఎదుగుదలకు, వారి అభివృద్ధికి పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ విభా గాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యకమంలో విశ్రాంత జేసీ పి.రజనీకాంతరావు, విశ్రాంత డీఈవో బి.మల్లేశ్వరరావు, ఎం.శ్యామ్‌ప్రసాద్, డీవైఈవో ఆర్.విజయకుమారి, జెమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.సుధీర్, కె.దుర్గాశ్రీనివాస్, పాఠశాల ఎండీ కె.రమాకుమారి, డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన మహా నగర్ ఉత్సవాలు



ముగింపు వేడుకల్లో పాల్గొన్న నాయకులు, అధికారులు

స్థానిక కల్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న మహానగర్ ఉత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా ఛత్రపూర్ ఎమ్మెల్యే సుభాష్ బెహరా పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో బీడీపీ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ, గోపాల్ పట్నాయక్, సుధీప్ సాహు, నారాయణ మంకుడో తదితరులు పాల్గొన్నారు. – బరంపురం



సంబల్‌పూరి నృత్య ప్రదర్శన



ఒడిస్సీ నృత్య ప్రదర్శన



ఆకట్టుకుంటున్న పులి వేషాలు



ప్రశంసా పత్రాలతో కళాకారులు

ముగిసిన రాష్ట్రపతి పర్యటన



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ రఘుబర్ దాస్, సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన శనివారంతో ముగిసింది. దీంతో స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్‌లు ఆమెకు ఆత్మీయంగా శనివారం వీడ్కోలు పలికారు. పర్యటనలో రాష్ట్ర ఆతిథ్యంతో ఆమె ఆహ్లాదకరంగా గడిపి మాతృ రాష్ట్ర గొప్ప జ్ఞాపకాలను కూడగట్టుకుని వెళ్లి ఉంటారని ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు.

రాష్ట్రంలో ఒంటరిగానే పోటీ

- బీజేపీ ఇన్‌చార్జి విజయపాల్ సింగ్ తోమర్

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది. ఈ తరుణంలో అధికార బిజూ జనతా దళ్, ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ మధ్య పొత్తు కుదిరినట్లు ప్రచారం ఊపందుకుంది. అయితే ఇది కేవలం పుకారం మాత్రమేనని, ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి విజయపాల్ సింగ్ తోమర్ శనివారం స్పష్టం చేశారు. బిజూ జనతా దళ్‌తో పొత్తు కుదుర్చుకునే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో ఒకేసారి జరగనున్న లోక్‌సభ మరియు శాసన సభ ఎన్నికల కోసం బీజేడీతో ఎన్నికలకు ముందు పొత్తు పెట్టుకునే యోచనే లేదని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ స్పష్టం చేసిన కొద్దిసేపటికే, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి విజయపాల్ సింగ్ తోమర్ చెప్పడంతో పొత్తు పుకారుకు తెరపడిందని భావిస్తున్నారు. న్యూఢిల్లీలో జరిగిన బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశానికి హాజరైన తోమర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఒడిశాలో ఎన్నికల పొత్తుపై పార్టీలో ఎటువంటి చర్చ జరగలేదన్నారు. తాను పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో వివిధ ఎన్నికల అంశాలపై చర్చించానని, అయితే ఒడిశాలో పొత్తుపై ఎలాంటి ప్రస్తావన చోటు చేసుకోలేదన్నారు.

భారీ ఆధిక్యతతో గెలుస్తాం

రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఒంటరిగా 147 స్థానాలకు పోటీచేసి, 80 పైబడి స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే 21 లోక్‌సభ స్థానాల్లో 16 కంటే ఎక్కువ లోక్‌సభ స్థానాలను బీజేపీ గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ఎలాంటి పొత్తు పెట్టుకోదని చెప్పారు. మొత్తం 21 లోక్‌సభ స్థానాలను భారతీయ జనతా పార్టీ గెలుచుకుంటుందన్నారు. రాష్ట్రంలో సింగిల్‌గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

3 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కూర్మానూర్ పంచాయతీ సిందూర్‌పల్లి గ్రామంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో కలిమెల పోలీసులు గ్రామంలోని లలిత్ హంతల్ ఇంటిపై దాడి చేశారు. సుమారు 11 బస్తాల్లో నిల్వ ఉంచిన 3 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని చత్తీష్‌గఢ్ తరలించేందుకు ఉంచినట్లు లలిత్ వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోద్ చేసిన పోలీసులు కోర్టులో శనివారం హాజరుపరిచారు.



గంజాయితో పట్టుబడిన నిందితుడు లలిత్

వ్యాన్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి..ఇద్దరికి గాయాలు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను ఢీకొని పప్పు శివ(19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. శనివారం మధ్యాహ్నం శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపుగా వెళ్తూ పైడిభీమవరంలోని అరబిందో పరిశ్రమ ఎదుట ఆగి ఉన్న వ్యాన్‌ను వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చిన ముగ్గురు యువకులు ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న శివ అక్కడిక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న భాస్కరరావు, హేమంత్‌లకు తీవ్ర గాయాలు కావడంతో అరబిందో అంబులెన్సుపై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ముగ్గురూ స్నేహితులు కావడంతో పూసపాటిరేగ మండలం గోవిందపురం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు శివ స్వగ్రామం జి.సిగడాం. తండ్రి లక్ష్మణరావు, తల్లి లక్ష్మి, తమ్ముడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై కె. గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో మృతుడు, క్షతగాత్రులు (ఇన్‌సెట్లో) శివ (ఫైల్ ఫోటో)

బీజేపీతో పొత్తు లేదు



మాట్లాడుతున్న సస్మిత్ పాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీతో ఎటువంటి పొత్తు లేదని బీజేడీ జాతీయ అధికార ప్రతినిధి సస్మిత్ పాత్రో స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీజేపీకి చెందిన కొందరు నాయకులు మీడియా ద్వారా రెండు పార్టీల మధ్య పొత్తు గురించి పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నేతలు ఎందుకు ఇలాంటి పుకార్లు వ్యాప్తి చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. రాబోయే ఎన్నికల పోరులో అధికార బీజేడీ చాలా బలమైన స్థితిలో ఉందని పేర్కొన్నారు. ఇటీవల కొంతమంది నేతలు బీజేడీని వీడి బీజేపీలో చేరడంపై స్పందించారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి అధికార పార్టీ నుంచి బహిష్కరణకు గురైనవారు, టిక్కెట్లు దక్కే అవకాశం లేనివారు మాత్రమే బీజేపీలో చేరుతున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థుల కొరతను ఎదుర్కొంటోందని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

పద్మపూర్ సమితిలో ఎంపీ సప్తగిరి పర్యటన



సమావేశంలో పాల్గొన్న ప్రజలు


రాయగడ: కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక జిల్లాలోని పద్మపూర్ సమితి లికిటిపాదొరొ, గులుగుడ, నువాగుడ పంచాయతీల్లో శనివారం పర్యటించారు. లికిటిపాదొరొ పంచాయతీలోని సొరాపల్లి గ్రామంలో జరిగిన క్రిస్టియన్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అధికార మార్పిడి అవసరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని, ఆ దిశగా ఈసారి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు. రెండు దశాబ్దాలకు పైగా అధికారంలో ఉన్నటువంటి బీజేడీపై ప్రజలు విసుగెత్తిపోయారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రజలకు దూరంగా ఉంటూ వారి బాగోగులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజల సమస్యలు తెలుసుకోలేని ముఖ్యమంత్రి మనకు అవసరమా అని ప్రశ్నించారు. అనంతరం లికిటిపాదొరొ పంచాయతీ పరిధి ముస్కి, సవురాపల్లి, లికిటిపాదొరొ, గులుగుడ ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన జియో టవర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ సప్తగిరి ఉలక

మోడల్ స్కూల్.. డిమాండ్ ఫుల్

- కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన
- ఇంగ్లిష్ మీడియంతో అద్భుత ఫలితాలు
- జిల్లాలో 13 మోడల్ స్కూళ్లలో 1300 సీట్ల భర్తీ
- ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- మార్చి 3 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- లాటరీ విధానానికి స్వస్తి.. 21న ప్రవేశ పరీక్ష



మోడల్‌స్కూల్‌లో నీట్ తరగతుల నిర్వహణలో సమగ్రశిక్ష ఏఎంవో జి.లక్ష్మీనారాయణ



ఏపీ మోడల్ స్కూల్ కుప్పిలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లిషు భాషతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర సబ్జెక్టుల్లో పట్టు తప్పనిసరి. ఇవన్నీ గతంలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమయ్యేవి. ఈ నేపథ్యంలో ప్రతి నిరుపేద విద్యార్థికి ఉత్తమ విద్యను అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలు (ఏపీ మోడల్ స్కూళ్లు/జూనియర్ కళాశాలలు) నేడు రాష్ట్ర ప్రభుత్వ ఆదరణతో సత్ఫలితాలు సాధిస్తున్నాయి. పరీక్ష ఏదైనా ఫలితాల్లో దూసుకెళ్తున్నాయి. ఇందులో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

3 నుంచి దరఖాస్తుల స్వీకరణ..

2024–25 విద్యా సంవత్సరానికిగాను మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ నెల 2వ తేదీ నుంచి నెట్‌బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్‌కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో ఎగ్జామినేషన్ ఫీజుకు చెల్లుబాటు కానుండగా, దరఖాస్తులు చేసుకునే ప్రక్రియ ఈ నెల 3 నుంచి మొదలుకానుంది. ఆన్‌లైన్ పేమెంట్‌కు ఈ నెల 31వ తేదీతో గడువు ముగియనుంది.

జిల్లాలో 13 మోడల్ స్కూళ్లు

జిల్లాలో ఇచ్ఛాపురం(పురుషోత్తపురం), కంచిలి(ఎం.ఎస్.పల్లి), కవిటి(రాజపురం), సోంపేట(సోంపేట), పోలాకి(ఈదుళ్లవలస), పాతపట్నం(ప్రహరాజపురం), జలుమూరు(కరవంజ), జి.సిగడాం, లావేరు(తామాడ), రణస్థలం(కొండములగాం), పొందూరు(వావిలపల్లిపేట), ఎచ్చెర్ల(కుప్పిలి), బూర్జ(ఓవీపేట) పాఠశాలల్లో ఒక్కోచోట 100 సీట్లను భర్తీ చేస్తారు. ఈ లెక్కన మొత్తం 1300 మందిని ఎంపికచేస్తారు.

పాత పద్ధతిలో పరీక్ష..

లాటరీ విధానికి పూర్తిగా స్వస్తిపలికి దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూలులోనే ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్‌లిస్టు ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్‌లిస్టు, 29న ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తారు. 30న సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూన్ 12 నుంచి తరగతులు

ఎంపిక ఇలా..

- 6వ తరగతిలో ప్రవేశం పొందే ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. పరీక్ష ఫీజు రూ.150. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 30 మార్కులు పొంది ఉండాలి. పరీక్ష ఫీజు రూ.75 మాత్రమే.
- ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022–23, 2023–24 విద్యాసంవత్సరాల్లో 4, 5 తరగతల్లో చదివి ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి.
- పరీక్షలో వచ్చే మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రతిపాదికన సీట్లు కేటాయిస్తారు.
- సీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ లేదా ఏపీఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

మోడల్ స్కూళ్లలో లభిస్తున్న సౌకర్యాలివే..

- నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన
- ఐదు ఎకరాల సువిశాల ప్రాంగణాలతో రెండంతస్తుల భవనాలు
- 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇంగ్లిషు మీడియంలోనే విద్యా బోధన
- నీట్, జేఈఈ, ఎంసెట్, ఎన్ఎమ్ఎమ్ఎస్, ఐఎంవో, ఐఎస్వో లాంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్‌లు
- ఎల్సీడీ ప్రాజెక్టర్ విద్యా బోధన, డిజిటల్ విద్యా బోధన
- ఇంటర్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు
- 9వ తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు
- మోడల్ స్కూళ్లకు సమీప గ్రామాల అనుసంధానంతో కూడిన ఆర్టీసీ బస్సులు ప్రత్యేకగా నడిపిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించాలనే ధ్యేయంతో ఏపీ మోడల్ స్కూళ్లను తీసుకొచ్చారు. ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులకు సైతం విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. సద్వినియోగం చేసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

టీడీపీ అభ్యర్థికి వ్యతిరేకంగా ర్యాలీ

- కార్యకర్తలతో రహస్యంగా సమావేశమైన కేపీ నాయుడు



ర్యాలీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

గంట్యాడ: గజపతినగరం టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ కార్యకర్తలు శనివారం ర్యాలీ నిర్వహించారు. గంట్యాడ నుంచి విజయనగరం వరకు ర్యాలీ నిర్వహించారు. కొండపల్లి శ్రీనివాస్‌కు టీడీపీ టికెట్టు ఇవ్వడాన్ని ఆ పార్టీ టికెట్టు ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే కేపీ నాయుడు వర్గం వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో స్థానిక కేపీఎస్‌బీఈడీ కళాశాలలో కేపీ నాయుడు కార్యకర్తలతో రహస్యంగా సమావేశం నిర్వహించారు. గజపతినగరం టికెట్టు విషయంలో పార్టీ అధిష్ఠానం పునరాలోచించి త్వరలో ఏదో ఒక నిర్ణయం తీసుకుంటుందని కేపీ నాయుడు కార్యకర్తలకు చెప్పినట్టు సమాచారం.

త్రుటిలో తప్పిన ప్రమాదం



చందక పేట జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న వేరొక లారీ

బొండపల్లి: మండలంలోని చందకపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారి 26పై శనివారం వేకువ జామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు లారీలు వెనుక, ముందు భాగాలు నుజ్జయ్యాయి. ప్రమాదానికి సంబంధించి వివరాలు.. విజయనగరం వైపు నుంచి సాలూరు వైపు వెళ్తున్న ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వస్తున్న వేరొక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు లారీల్లో ఉన్న డ్రైవర్లు, క్లీనర్లకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: ఫోర్జరీ కేసులో నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం తెలిపిన వివరాలు... తూర్పుగోదావరి జిల్లాలో జీఆర్‌పీ విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు అనే వ్యక్తికి అంబులెన్స్ శివ పరిచయమయ్యాడు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న హేమంత్‌కుమార్ అనే వ్యక్తి విజయనగరం జిల్లా నుంచి తూర్పుగోదావరి జిల్లాకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నాడని నమ్మించి శ్రీనివాసరావు నుంచి రూ.2.50 లక్షలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు. అంతేకాకుండా హేమంత్‌కుమార్‌కు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తి లేకపోయినప్పటికీ, అతని పేరున ఒక దరఖాస్తు రాసి, హేమంత్ కుమార్ సంతకాన్ని అంబులెన్స్ శివ ఫోర్జరీ చేసి, శ్రీనివాసరావుకు అప్పగించాడన్నారు. ఈ మేరకు శ్రీనివాసరావు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నం చేసి, బదిలీ అయినట్లు ఉన్నతాధికారుల నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయం హేమంత్‌కుమార్‌కు తెలిసి, తాను ఎటువంటి దరఖాస్తు చేయలేదని, ఉన్నతాధికారులకు వివరించారు. దీంతో హేమంత్‌కుమార్ అసలు దరఖాస్తు చేయలేదని తెలుసుకుని శ్రీనివాసరావు అంబులెన్స్ శివపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు విచారణలో అంబులెన్స్ శివ... హేమంత్‌కుమార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, శ్రీనివాసరావును మోసం చేసినట్లు నిర్ధారించుకొని అంబులెన్స్ శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వన్‌టౌన్ సీఐ వెంకటరావు తెలిపారు.

ఈఎండీపీ ఎక్స్‌పో రాష్ట్ర పోటీలకు ఎంపికలు పూర్తి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విజేతలతో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌టీ నాయుడు

విజయనగరం అర్బన్: రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంట్రప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) ఎక్స్‌పో పోటీలకు జిల్లా నుంచి పాల్గొనే ప్రాజెక్టుల ఎంపిక పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్, అఫ్లటూన్ ఇంటర్నేషనల్ సంయుక్త సహకారంతో స్థానిక కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో శనివారం చేపట్టిన ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా 12 పాఠశాలల నుంచి విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను పోటీ ప్రదర్శనకు ఉంచారు. పోటీలను ప్రారంభించిన జిల్లా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు మాట్లాడుతూ పరిశోధనా దృక్పథం విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచి రావాలని అన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు బోధనలు ఉండాలని సూచించారు.

పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్

- కేరళను మించి ఏపీలో విద్యా వ్యవస్థ
- రాష్ట్రంలోనే తొలి ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎంపీ బెల్లాన



ల్యాబ్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎస్ఎస్ఏ ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు, ఇంటెల్ సంస్థ డైరెక్టర్ శ్వేతఖురానా తదితరులు

చీపురుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్ అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం – ప్రైవేటు విధానంలో ప్రముఖ దిగ్గజ సంస్థ ఇంటెల్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ ల్యాబ్‌ను రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ ల్యాబ్ లక్ష్యాలను అక్కడున్న ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవస్థలో కృత్రిమ మేధో సంపత్తు ఎంతో అవసరమన్నారు. జీవన విధానంలో ప్రతీ అంశానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ముడిపడి ఉందన్నారు. అందుకనే విద్యార్థులు చిన్న వయస్సు నుంచి కృత్రిమ మేధో సంపదను అభివృద్ధి చేసుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రముఖ దిగ్గజ సంస్థ ఇంటెల్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుని రూ.లక్షల వ్యయంతో ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే తొలి ల్యాబ్‌ను చీపురుపల్లిలో ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకోవాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో విలువైన బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు కూడా అందజేసినట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు కారణంగా ఏపీలో విద్య కేరళను మించిపోయిందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా బాలుర ఉన్నత పాఠశాలకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పాఠశాలను ఆధునీకరించుకోనున్నట్లు చెప్పారు.

విద్యా వ్యవస్థకు సీఎం తొలి ప్రాధాన్యత

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని, పేద పిల్లలు భవిష్యత్‌పై సీఎంకు ప్రత్యేక శ్రద్ధ ఉందని రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వద్ద కూడా లేని ట్యాబ్‌లు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దగ్గర ఉన్నాయన్నారు. ఆ ట్యాబ్‌ల్లో ఉన్న బైజూస్ కంటెంట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలకు సమాధానాలను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ల్యాబ్‌ల్లో ప్రాజెక్టులు ద్వారా తయారు చేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ల్యాబ్‌లను ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్వహించాలని సూచించారు. బాలుర ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇంటెల్ ఇండియా సంస్థ డైరెక్టర్ శ్వేతఖురానా, డీఈఓ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరణపు బాలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవింద, పతివాడ రాజారావు, గిరడ రాందాసు, సువ్వాడ అప్పలనాయుడు, కరణపు ఆది, దాలయ్య, ఎంఈఓ ఎం.బూసినాయుడు, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీగ లాగారు.. డొంక కదిలింది



మాట్లాడుతున్న శ్రీకాకుళం ఎస్పీ రాధిక, రికవరీ చేసిన సామగ్రి

- 7 కేసుల్లో 21 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఒడిశాకు చెందిన ఇద్దరు అరెస్టు
- ఎస్పీ జీఆర్ రాధిక ప్రకటన

నరసన్నపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు దొంగతనాలకు పాల్పడిన కేసులను నరసన్నపేట పోలీసులు ఛేదించారు. నరసన్నపేట శ్రీరామ నగర్–3లో జామి వరలక్ష్మి అనే మహిళ మెడలో నుంచి గత నెలలో బంగారు ఆభరణం ఎత్తుకెళ్లారు. దీనిపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసులు మరో ఆరు కేసుల్లో నిందితులుగా ఉన్న ఒడిశాకు చెందిన వ్యక్తులు శిబ శంకర్ మహంతి, సురేష్ పాడిలను అరెస్టు చేశారు. వీరి వద్ద 7 కేసులకు సంబంధించి 21 తులాల ముప్పావు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక నరసన్నపేట సీఐ కార్యాలయంలో శనివారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. పార్వతీపురం పీఎస్‌లో రెండు, విజయనగరం టూ టౌన్‌లో రెండు, విశాఖ సిటీ పీఎం పాలెం, విశాఖ త్రీ టౌన్, నరసన్నపేట పోలీసు స్టేషన్లలో నమోదైన చోరీ, చైన్ స్నాచింగ్ కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు. నరసన్నపేటలో లభించిన ఆధారాలతో దర్యాప్తు చేయగా పాత కేసుల విషయాలు తెలిశాయని, ఆ సొత్తును కూడా రికవరీ చేశామని ఆమె వెల్లడించారు. వీరు చైన్ స్నాచింగ్ చేస్తూ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు బైక్ నంబర్ ప్లేట్లు మారుస్తూ వచ్చారని వివరించారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలు విక్రయించకుండా కరిగిస్తున్నారని, దీనికి సంబంధించిన సామగ్రి కూడా రికవరీ చేశామని చెప్పారు. వీరి వద్ద నుంచి రెండు చాకులు, ఒక నాటు తుపాకీతో పాటు వారు వాడిన నంబరు ప్లేట్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నరసన్నపేట జమ్ము కూడలి వద్ద వీరిని అరెస్టు చేశామన్నారు. శిబ శంకర్‌ది బరంపురంలో కృష్ణంపేట వీధి అని, సురేష్ పాడిది అదే పట్టణంలోని లక్ష్మీనరసింగవీధి గా గుర్తించామని పోలీసులు తెలిపారు ప్రెస్ మీట్ లో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు, ఎస్ఐ అశోక్‌బాబులు ఉన్నారు.

'అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: అగ్నిపథ్ పథకంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి అగ్నివీర్‌లో రిక్రూట్‌మెంట్ చేసేందుకు ఆర్మీ రిక్రూటింగ్ విశాఖపట్నం కార్యాలయం యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ నిశాంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్‌లో చేరేందుకు ఆన్‌లైన్ ఎంపిక పరీక్ష కోసం వివాహం కాని పురుష అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్ పోస్టులకు 10వ తరగతి, అగ్నివీర్ ట్రేడ్‌మన్‌కు 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఎంపిక పరీక్ష కోసం రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 22వ తేదీలోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్ ఇండియా ఆర్మీ.ఎన్ఐసీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గిరిజనులకు అండగా నిలుస్తాం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

- ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏఎస్పీ సునీల్‌షరోన్
- కూనేరులో మెగా వైద్య శిబిరం ఏర్పాటు
- 500 మంది గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు
- ఉచితంగా మందులు అందజేత
- గిరిజన యువతకు వాల్‌బాల్ కిట్లు, వృద్ధులకు గొడుగుల పంపిణీ



యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్పీ

కొమరాడ: గిరిజనులకు విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని, ఆర్థికోన్నతి కోసం సంక్షేమ పథకాలు అందజేస్తోమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మండలంలోని కూనేరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో తిరుమల, మెడికవర్ ఆస్పత్రుల వైద్యులతో కలిసి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు.ఆనంతరం గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు, వృద్ధులకు చీరలు, గొడులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గిరిజనులు రేయింబవళ్లు కష్టపడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఊరూరా నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆయుష్షును పెంచుకోవాలని సూచించారు. శిబిరంలో కార్డియాలజీ, గైనకాలజిస్టుతో పాటు జనరల్, కంటి వైద్య నిపుణుల కూడిన బృందం వైద్యసేవలు అందించింది. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సునీల్‌షరోన్, కొమరాడ, కూనేరు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో పాటు పార్వతీపురం రూరల్ సీఐ కె.రవికుమార్, రూరల్ ఎస్ఐ పి.దినకర్, ఎస్ఐ కె.నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

5లోగా ఈ -క్రాప్ సవరణకు అభ్యంతరాలు తెలియజేయాలి

పార్వతీపురం టౌన్: ఈ – క్రాప్ సవరణకు ఈ నెల 5లోగా అభ్యంతరాలు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ శనివారం తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రబీ 2023 - 24లో 31,638 ఎకరాలలో సాగు, ఈ–పంట నమోదు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడు వరకు ఈ పంట ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరిగిందని పేర్కొన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాలలో రబీ 2023 –24 నకు సంబంధించి ఈ పంట ముసాయిదా జాబితా సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించనున్నట్టు తెలిపారు. మార్పులు అనంతరం తుది జాబితాలను ఈ నెల 8న రైతుభరోసా కేంద్రాలలో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. రైతులంతా తమ పరిధిలో గల రైతు భరోసా కేంద్ర పరిధిలో వున్న సామాజిక తనిఖీల్లో ప్రదర్శించిన ముసాయిదా జాబితాను చూసి సాగు చేసిన పంట నమోదులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సవరణకు రైతు భరోసా కేంద్రంలో వున్న వీఏఏ, వీహెచ్ఏ, ఏఎస్ఏలను ఈ నెల 5లోగా సంప్రదించి అభ్యంతరాలు రా త పూర్వకంగా తెలియజేయాలన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కేసులు

విజయనగరం ఫోర్ట్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై దాడులు చేసి 107 కేసులు నమోదు చేసినట్టు విద్యుత్ విజిలెన్స్ సి.ఐ కె.కృష్ణ శనివారం తెలిపారు. చౌర్యం చేస్తున్న నిందితులు నుంచి రూ.8.50 లక్షల అపరాధ రుసుం, జరిమాన కింద రూ.92 వేలు వసూలు చేసినట్టు చెప్పారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్టయితే 08922-234579 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

చీపురుపల్లి: పట్టణంలో రైల్వేస్టేషన్ నుంచి గరివిడి మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధర్ శనివారం తెలిపారు. మృతురాలి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుందని, కుంకుమ రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉన్నట్లు ఆయన తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9618017943 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

6న మేగా జాబ్ మేళా

విజయనగరం అర్బన్: వివిధ ప్రైవేటు కంపెనీల్లో దాదాపు 910 ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 6న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రెడ్డీస్‌లో ట్రైనీ అప్రంటీస్ (90), భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూసిస్ లిమిటెడ్‌లో లోన్ ఆఫీసర్ (150), శ్రీరక్షిత బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెలీకాలర్స్ (20), డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో ట్రైనీ కెమిస్ట్, ఆపరేషన్స్, మెయింటెనెన్స్ ప్రొడక్షన్ ఏఎన్ఎఫ్‌డీ (150), పెట్రో ల్యాబ్స్ లిమిటెడ్‌లో ప్రొడక్షన్, క్యూసీ, క్యూ, ఆర్అండ్‌డీ, టీఎస్‌డీ, ఐపీక్యూఏ (130), టీంలీస్ (ఎస్‌బీఐ కార్డ్స్)లో బ్రాంచ్ రిలేషన్ షిప్ ఎక్జిక్యూటర్ (150), ముత్తూట్ ఫైనాన్స్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్, ఇంటర్న్ (150), ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్‌లో రిలేషన్ షిప్ ఆఫీసర్ (50), బ్రాంచ్ మేనేజర్ (20) తదితర ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాద్, పైడిభీమవరం, దువ్వాడ, బాచుపల్లి, తుని, ఆంధ్రా, తెలంగాణా ప్రాంతాల్లో ఆయా పోస్టులను బట్టి పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా 'ఎన్‌సీఎస్.జీఓవి.ఐఎన్' వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకొని, ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు విజయనగరంలోని గంటస్తంభం సమీపంలోని ఎంఆర్‌కళాలలో జరిగే ఇంటర్వ్యూకు సంబంధిత సర్టిఫికెట్ కాపీలు, రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాల కోసం సెల్: 89193 78915 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీతంలో 'యూత్ పార్లమెంట్'



మోడల్ పార్లమెంట్ సమావేశంలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని బాలల హక్కుల చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి కె.ఉజ్వల్, మెడికల్ కౌన్సెలర్ త్రినాథద్‌రావు, జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, సెట్విజ్ సీఈఓ రామగోపాలరావు, సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

- తన అన్నయ్య వివాహ ఆహ్వాన కార్డులు పంచేందుకు వెళ్తుండగా ఘటన



సత్యనారాయణ(ఫైల్)

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం హైవేపై ఇరువాడ సమీపంలో బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలోని కోమటిపల్లికి చెందిన సింగరాతి సత్యనారాయణ(23) తన అన్నయ్య ఈశ్వరరావుతో కలిసి దువ్వాడ సమీపంలోని ఓ కేటరింగ్ సర్వీస్‌లో కుక్‌గా పనిచేస్తున్నారు. ఈశ్వరరావుకు ఈ నెల 27న వివాహం నిశ్చయమైంది. దీంతో వీరిద్దరూ శుక్రవారం రాత్రి అనకాపల్లిలోని స్నేహితుడికి పెళ్లి కార్డు ఇవ్వడానికి వెళ్లి.. రాత్రి అక్కడే బస చేశారు. వివాహ ఆహ్వాన కార్డులు పంచేందుకు శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో సత్యనారాయణ ఒక్కడే బైక్‌పై తన స్వగ్రామం బయలుదేరాడు. సర్వీస్ రోడ్డులో అనకాపల్లి నుంచి పెందుర్తి వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న క్వారీ లారీ బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి అతను పడిపోగా.. అదే సమయంలో వెనకనే వస్తున్న డంపర్ లారీ అతనిపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి తండ్రి సింహాచలం, తల్లి పద్మ, సోదరి దాలమ్మ ఉన్నారు. సోదరుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు సబ్బవరం సీఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాగిపిండి పంపిణీని ప్రారంభించిన జేసీ



రాగి పిండి ప్యాకెట్‌ను అందజేస్తున్న జేసీ కార్తీక్, డీఎస్ఓ మధుసూదరావు

విజయనగరం అర్బన్: ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయూ వాహనాల ద్వారా రాగిపిండి పంపిణీని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ప్రారంభించారు. కె.ఎల్.పురం రామమందిరం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రాగిపిండి ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం బలవర్ధక పోషకాహారమైన రాగిపిండిని ప్రభుత్వం సరఫరా చేస్తోందని చెప్పారు. కిలో రాగిపిండి ప్యాకెట్‌కు కార్డుదారులు రూ.11 చెల్లిస్తే చాలన్నారు. ఇది బహిరంగ మార్కెట్‌లో రూ.45 నుంచి రూ.50 పలుకుతోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. రాగిపిండి కావాల్సిన వారికి ఒక కిలో బియ్యం తగ్గించి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. రేషన్ సరుకుల సరఫరాను తనిఖీ చేశారు. బయోమెట్రిక్ పనిచేయని వారికి ఐరిస్ ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని వినియోగించాలని జేసీ కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కె.మధుసూదనరావు, తహసీల్దార్ ఎ.వి.రత్నం, సీఎస్‌డీటీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సారిపల్లి శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ



సారిపల్లి డీటీసీని పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల విధులకు త్వరలో జిల్లాకు రానున్న కేంద్ర బలగాలు సారిపల్లి జిల్లా శిక్షణ కేంద్రంలో బస చేసేందుకు అవసరమైన మౌలిక వసతులను ఎస్పీ ఎం.దీపిక శనివారం పరిశీలించారు. శిక్షణ కేంద్రంలోని గదులు, మంచాలు, నీటి వసతులు, వంట గదులు, భోజనశాల తదితర ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు సిబ్బంది ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపీఎస్ కుమారి మండ జావలి అల్ఫాన్స్, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఏఆర్ డీఎస్పీ యానివర్స్, ఎస్‌బీ సీఐ ఇ.నరసింహమూర్తి, టూటౌన్ సీఐ కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదుల నమోదుకు ఏర్పాట్లు

- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో త్వరలో జరగనున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, నమోదుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నోడల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో కంప్లయింట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటుపై జిల్లా అధికారులతో కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఫిర్యాదుల స్వీకరణ, నమోదుకు సంబంధించిన అన్ని విభాగాలు ఒకే కంట్రోల్‌రూమ్‌లో ఉంటూ విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఎస్.డి.అనితను ఆదేశించారు. ఫోన్‌లో ఫిర్యాదుల స్వీకరణకు రెండు ఫోన్ నంబర్లను కేటాయించాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు అవసరమైన సిబ్బంది, టీవీ స్క్రీన్లు, కంప్యూటర్లు సమకూర్చడంపై ప్రతిపాదలను రూపొందించాలని చెప్పారు. ఈ విభాగంలో పనిచేసే సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపేలా నివేదికలు రూపొందించి పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులన్నీ నమోదు చేసే అధికారిగా ముఖ్య ప్రణాళిక అధికారి వ్యవహరిస్తారని చెప్పారు. ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలు, సీ–విజిల్ యాప్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులను నమోదుచేసి సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెనువెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పి.బాలాజీ, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఎస్ఐసీ అధికారి బాలు, డీపీఆర్ఓ డి.రామేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రభాకరరావు, డీటీ సూర్య, సమాచారశాఖ డీఈ ఎస్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ హుండీల ఆదాయం రూ.16,90,459

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి ఆలయంలోని ఆరు హుండీల ఆదాయాన్ని జిల్లా దేవదాయశాఖ అధికారి డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. అమ్మవారి మూడో జాతర నుంచి ఆరో జాతర వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.16,90,459 నగదు, 14 గ్రాముల బంగారం, 190 గ్రాముల వెండి వచ్చినట్టు ఈఓ వి.వి సూర్యనారాయణ తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, రివ్వన్నాయుడు, ఆక్యాన నరసింగరావు, కురుపాం మండలం జగ్గునాయుడు పేట గ్రామానికి చెందిన శ్రీవారి సేవకులు, సాయి సేవకులు పాల్గొన్నారు.

సంగాంలో మహాశివరాత్రి ఏర్పాట్లు



పందిరి రాట వేస్తున్న అర్చకులు, భక్తులు

వంగర: సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో మహాశివరాత్రి ఏర్పాట్లను శనివారం ప్రారంభించారు. ఆలయ చైర్మన్ బోను నాగరాజు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి శాస్త్రోక్తంగా పందిరిరాట వేశారు. శివరాత్రి పర్వదినాన స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.